# మక్తల్.. ప్రగతి పరుగుల్

- మారిన నియోజకవర్గ రూపురేఖలు
- విద్య, వైద్య రంగాలకు సర్కారు పెద్దపీట
- రూ.వందల కోట్లతో అభివృద్ధి పనులు
- రూ.35 కోట్లతో 150 పడకల దవాఖానకు శంకుస్థాపన
- రూ.6 కోట్లతో వ్యవసాయ గోదాంల నిర్మాణం
- గ్రామాలు, తండాలకు బీటీ, సీసీ సౌకర్యం
- ఫలించిన ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషి
- ఈసారీ 'కారు'దే హవా అంటున్న ప్రజలు

ఊట్కూర్, నవంబర్ 1 : బీఆర్ఎస్ సర్కారు పాలనలో మక్తల్ నియోజకవర్గ రూపురేఖలు మారిపోయాయి. రూ.కోట్ల నిధులతో అనేక అభివృద్ధి పనులు చేపట్టారు. దీంతో నియోజకవర్గంలో కారు జోరు కొనసాగుతున్నది. ఎమ్మెల్యే, బీఆర్ఎస్ అసెంబ్లీ అభ్యర్థి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి హ్యాట్రిక్ విజయం సాధించనున్నారు. 2018 ఎన్నికల్లో బీఆర్ఎస్ (అప్పటి టీఆర్ఎస్) తరఫున పోటీ చేసి నారాయణపేట జిల్లాలోనే అత్యధికంగా 45 వేలకుపైగా మెజార్టీ సాధించి రికార్డు సృష్టించారు. ఆనాటి నుంచి నేటి వరకు ప్రజలకు నిరంతరం అందుబాటులో ఉంటూ.. అభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తున్నారు. సీఎం కేసీఆర్ హయాంలో బీఆర్ఎస్ సర్కారు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు మరింత దగ్గరయ్యారు. దీంతో ఈ సారి ఎన్నికల్లో చిట్టెం గెలుపు నల్లేరు మీద నడకేనని ప్రజలు చెబుతున్నారు.

**మక్తల్ నియోజకవర్గం ప్రొఫైల్..**

1952లో మక్తల్ నియోజకవర్గంగా ఏర్పడిం ది. ఉప ఎన్నికలతో కలిపి ఇప్పటివరకు 16 సార్లు ఎన్నికలు జరిగాయి. డీలిమిటేషన్‌లో భాగంగా 2009 ఎన్నికల్లో మక్తల్ సెగ్మెంట్ నుంచి నారాయణపేట, దామరగిద్ద మండలాలను తొలగించి కొత్తగా అమరచింత సెగ్మెంట్‌లో ఉన్న ఆత్మకూర్, అమరచింత, నర్వ మండలాలను మక్తల్‌కు చేర్చారు. మక్తల్, ఊట్కూర్, నర్వ, మాగనూరు, కృష్ణ, ఆత్మకూర్, అమరచింత మొత్తం 7 మండలాలతో కలిపి మక్తల్ నియోజక వర్గం ఏర్పడింది. 1952 నుంచి 1983 వరకు కాంగ్రెస్, ఇండిపెండెంట్ అభ్యర్థులే విజయం సాధించారు. 1972 లో కాంగ్రెస్ నుంచి బరిలో నిలిచిన కల్యాణీ రాంచందర్‌రావు ఏకగ్రీవంగా ఎన్నికయ్యా రు. అదే సెగ్మెంట్ నుంచి ప్రస్తుత సిట్టింగ్ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి తండ్రి, దివంగత చిట్టెం నర్సిరెడ్డి ఒక పర్యాయం జనతా పార్టీ నుంచి, మరోసారి జనతా దళ్ పార్టీ నుంచి గెలుపొందారు. రెండు సార్లు టీడీపీ నుండి ఎల్లారెడ్డి విజయం సాధించారు. 2004 ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ నుంచి గెలుపొందిన చిట్టెం నర్సిరెడ్డి 2005 పంద్రాగస్టు వేడుకల్లో నక్సల్స్ జరిపిన కాల్పుల్లో మరణించారు. అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో ఆయన తనయుడు చిట్టెం రామ్మోహన్‌రెడ్డి మొదటిసారి ఎమ్మెల్యేగా గెలుపొంది అసెంబ్లీలో అడుగు పెట్టారు. అప్పటి నుంచి ఇప్పటివరకు హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా గెలుపొంది రికార్డు సాధించారు.

**మారిన మక్తల్ రూపురేఖలు..**

2014 అసెంబ్లీ ఎన్నికల్లో అప్పటి టీఆర్ఎస్ అభ్యర్థి ఎల్లారెడ్డిపై కాంగ్రెస్ పార్టీ నుంచి చిట్టెం రామ్మోహన్‌రెడ్డి గెలుపొందారు. సీఎం కేసీఆర్ నేతృత్వంలో చేపట్టిన అభివృద్ధిని చూసి అనతి కాలంలోనే గులాబీ పార్టీలో చేరారు. వలసలకు నిలయమైన మక్తల్‌ను సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సహకారంతో అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు తీవ్రమైన కృషి చేశారు. ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువై 2018 ఎన్నికల్లో రికార్డు మెజార్టీతో మూడోసారి ఎమ్మెల్యేగా గెలుపొందా రు. సీఎం కేసీఆర్ మక్తల్ అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించడంతో పెండింగ్ ప్రాజెక్టుల ను పూర్తి చేయించారు. రామన్‌పాడు, భీమా, భూత్పూర్, సంగంబండ చిట్టెం నర్సిరెడ్డి రిజర్వాయర్ల నుంచి మక్తల్, కృష్ణ, మాగనూర్, నర్వ, ఆత్మకూర్, అమరచింత మండలాల్లోని 2 లక్షల ఎకరాలకు సాగు నీరందించారు. రిజర్వాయర్ల కింద భూములు కోల్పోయిన వేలాది మంది నిర్వాసితులకు ప్రభుత్వం ద్వారా నష్టపరిహారం అందించేందుకు కృషి చేశారు. ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి కృషితో గ్రామాల్లో ఎటుచూసినా పచ్చని పైర్లు, సాగు నీటి వసతితో పంట పొలాలు కోనసీమను తలపిస్తున్నాయి.

**విద్య, వైద్యరంగానికి ప్రాధాన్యం..**

విద్య, వైద్యరంగాల పరంగా సీఎం కేసీఆర్, ఎమ్మెల్యే చిట్టెం మక్తల్ అభివృద్ధికి పెద్దపీట వేశా రు. పట్టణంలో కొత్తగా డిగ్రీ కళాశాల ఏర్పాటుకు రూ.6 కోట్లు మంజూరు చేయించారు. నియోజకవర్గంలో నాలుగు కేజీబీవీలను ఏర్పాటు చేశారు. రూ.9 కోట్లతో ఊట్కూర్, నర్వ, కృష్ణ, అమరచింత మండలాల్లో కేజీబీవీ స్థాయిని పెంచి విద్యార్థినులకు ఇంటర్మీడియట్ విద్యనభ్యసించే అవకాశం కల్పించారు. పట్టణంలో రూ.35 కోట్లతో 150 పడకల దవాఖాన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. మారుమూల గ్రామాల్లో పల్లె దవాఖానల ఏర్పాటుకు కృషి చేశారు. రూ.1.70 కోట్లతో సమీకృత మార్కెట్, రూ.70 లక్షలతో మార్కెట్ కార్యాలయ భవన నిర్మాణ పనులను చేపట్టారు. రుద్ర సముద్రం సమీపంలో రూ.6 కోట్లతో వ్యవసాయ గోదాంలను నిర్మించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోతూ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి విస్తృతంగా ప్రచారం చేపడుతున్నారు. మక్తల్ నియోజకవర్గంలో మున్సిపాలిటీ చైర్మన్లు, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, సింగిల్‌విండో చైర్మన్లు, సర్పంచులు, జెడ్పీ చైర్మన్, డీసీసీబీ చైర్మన్ బీఆర్ఎస్‌కు చెందిన వారే ఉన్నారు. దీంతో బీఆర్ఎస్ గ్రాఫ్ పెరిగింది. మక్తల్ గడ్డపై మరోమారు గులాబీ జెండా ఎగరడం ఖాయం కావడంతో ఇతర పార్టీ సర్పంచులు, నాయకులు, కార్యకర్తలు బీఆర్ఎస్‌లో చేరుతున్నారు.



కాలువల ద్వారా పొలాలకు పారుతున్న సంగంబండ రిజర్వాయర్ నీరు (ఫైల్)



నర్వ మండలకేంద్రంలో పీహెచ్‌సీ భవనం

**ఇప్పటివరకు చేపట్టిన అభివృద్ధి పనులు..**

- గత అసెంబ్లీ ఎన్నికల నాటికి మేజర్ గ్రామ పంచాయతీలుగా ఉన్న మక్తల్, ఆత్మకూర్, అమరచింత పట్టణాలను మున్సిపాలిటీలుగా ఏర్పాటు చేశారు.
- కొత్తగా అమరచింత, కృష్ణ మండలాలను ఏర్పాటు చేసి ప్రజలకు ఎంపీడీవో, తాసీల్దార్, పోలీస్‌స్టేషన్ కార్యాలయాలతో పాలన చేరువ చేశారు.
- తెలంగాణ అర్బన్ ఫైనాన్స్ అండ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ (టీయూఎఫ్ఐడీసీ) నిధుల నుంచి రూ.15 కోట్లతో మూడు మున్సిపాలిటీలను సుందరీకరించారు. విశాలమైన రహదారులు, డివైడర్లు, సెంట్రల్ లైటింగ్, లింకు రోడ్ల అభివృద్ధి పనులు చేపట్టారు.
- సీఎం స్పెషల్ డెవలప్‌మెంట్ ఫండ్ (ఎస్‌డీఎఫ్) కింద రూ.15 కోట్లతో 90 శాతం గ్రామాలకు బీటీ, అంతర్గత సీసీ రోడ్లు, డ్రైనేజీల నిర్మాణ పనులు చేపట్టారు.
- గుడెబల్లూర్, కర్ని, ఖానాపూర్, ఓబ్లాపూర్ గ్రామాల్లో రూ.6 కోట్లతో సబ్‌స్టేషన్లను నిర్మించారు. రూ.2.50 కోట్లతో ఫైర్‌స్టేషన్ భవన పనులను ప్రారంభించారు.
- దేవరకద్ర-మునీరాబాద్ నూతన రైలు మార్గంలో భాగంగా నియోజవర్గంలోని జక్లేర్, మక్తల్, మాగనూర్, కున్సిలో నాలుగు రైల్వేస్టేషన్లను పూర్తి చేయించి రాయిచూర్ నుంచి కాచిగూడకు రైలు ప్రయాణ సౌకర్యం కల్పించారు.
- మరికల్, వాసునగర్, టై రోడ్డు నుంచి కృష్ణ మండలం వరకు 70 కిలోమీటర్ల మేర 167, 150 నాలుగు లేన్ల జాతీయ రహదారి పనులను పూర్తి చేయించారు.



కృష్ణ మండలంలో నూతనంగా నిర్మించిన కేజీబీవీ కళాశాల

# కారు.. హుషారు

- బీఆర్ఎస్ గూటికి వలసల హోరు
- వనపర్తి నియోజకవర్గంలో జోరుగా చేరికలు
- అభివృద్ధికి ఆకర్షితులై యువత రాక
- వలసలతో మరింత బలోపేతం
- ప్రగతికి బాటలు వేస్తున్న మంత్రి నిరంజన్‌రెడ్డి



మంత్రి సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరుతున్న నాయకులు (ఫైల్)

వనపర్తి, నవంబర్ 1 (నమస్తే తెలంగాణ) : ఎన్నికలొస్తున్నాయంటే చాలు ఆ పార్టీ నుంచి ఈ పార్టీకి.. ఈ పార్టీ నుంచి ఆ పార్టీకి చేరికలు కనిపించేవి. కానీ ఈసారి రెండు నెలలుగా వరుస చేరికలు ఒకే పార్టీలోకి కొనసాగుతున్నాయి. అయితే ఇందుకు కారణాలు లేకపోలేదు. ఇక్కడి ప్రజల జీవన పరిస్థితులను అవగాహన చేసుకొని వారికి అండగా నిలబడి మెరుగైన జీవన ప్రమాణాలకు పునాదులు వేస్తున్న చరిత్ర కళ్లకు కట్టినట్లు కనిపిస్తుంది. పదేళ్లకు ముందు గత పాలకుల హయాంలో మొక్కుబడిగా అభివృద్ధి సాగింది. ప్రజలు శాశ్వ తంగా.. ప్రశాంతంగా బతికే వనరులపై దృష్టి నిలపలేదు. అలుపెరగని పోరాటంతో ఏర్పడిన తెలంగాణ రాష్ట్రంలో సీఎం కేసీఆర్ హయాంలో జనరంజక పాలన అందింది. బీఆర్ఎస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు, అభివృద్ధి, సంక్షేమ పథకాలకు పలువురు నాయకులు ఆకర్షితులవుతున్నారు. తొలి ఉద్యమ రోజు నుంచి రాష్ట్ర సాధనలో కీలక భూమిక పోషించిన వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి, ముఖ్యమంత్రి సహకారంతో చేస్తున్న అభివృద్ధితో భవిష్యత్‌కు బంగారు బాటలు వేస్తున్నారు. వీటన్నింటినీ గమనించిన యువత గులాబీ గూటికి చేరుతున్నారు.

**లక్షా 25 వేల ఎకరాలకు నీరు**

వనపర్తి నియోజకవర్గం సాగునీటి వనరులను పుష్కలంగా అందుకుంటున్నది. బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రధానంగా సాగునీటి వనరులపైనే దృష్టి నిలిపింది. సాగునీరు వనరుల కల్పనలతోనే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందన్న నమ్మకంతో ప్రాధాన్యతనిచ్చింది. రాత్రి, పగలనక కేఎల్ఐ కాలువల పనుల వెంట బస చేస్తూ నదుల నీటిని వనపర్తికి తరుముకొచ్చినట్లుగా చేసి నియోజకవర్గంలో మంత్రి నిరంజన్‌రెడ్డి లక్షా 25 వేల ఎకరాలకు సాగునీరు పారించి చరిత్ర సృష్టించారు. ఓడినా.. గెలిచినా.. నియోజకవర్గంలోనే ఉంటూ అన్ని రకాలుగా అభివృద్ధికి బాటలు వేశారు. గతంలో వనపర్తికి ఎమ్మెల్యేలుగా 15 దఫాల్లో ఇతరులే ఎన్నికవుతూ వచ్చారు. కేవలం ఒక్కసారి మాత్రమే బీఆర్ఎస్ అభ్యర్థిగా నిరంజన్‌రెడ్డి హయాంలో ఎంతో అభివృద్ధి జరిగింది.

**అక్టోబర్ నెలంతా చేరికలే..**

అక్టోబర్ నెల మొత్తంగా బీఆర్ఎస్‌లో చేరికలకే అన్నట్లు కనిస్తుంది. వరుస చేరికలతో గులాబీ పార్టీ జోష్ మీదున్నది. యువకులు, రైతులు, మహిళలు స్వచ్ఛందంగా తరలివస్తూ గులాబీ కండువాలు కప్పుకొంటున్నారు. మున్సిపాలిటీలోని వార్డుల నుంచి కాంగ్రెస్, బీజేపీ, ఇతర పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు ఆకర్షితులవుతున్నారు. ఇతర పార్టీల అలజడి లేకపోవడంతో కేవలం ఒకేపార్టీ అన్న చందంగా కారు దూసుకెళ్తున్నది. ఇటు చేరికల్లోనూ.. అటు ప్రచారంలోనూ బీఆర్ఎస్‌దే పైచేయిగా కనిపిస్తున్నది.

**ఇతర పార్టీల్లో టికెట్ల గందరగోళం**

ప్రతిపక్ష పార్టీల అభ్యర్థుల ఖరారుపై సందిగ్ధం నెలకొన్నది. గ్రూపు తగాదాలతో కాంగ్రెస్, బీజేపీ కొట్టుమిట్టాడుతున్నాయి. రావుల చంద్రశేఖర్ రెడ్డి, నాగం తిరుపతిరెడ్డితోపాటు పలువురు నాయకులంతా చేరడంతో బీఆర్ఎస్‌లో జోరు కొనసాగుతున్నది. పెద్ద నాయకుల నుంచి సాధారణ కార్యకర్త వరకు చేరికల ప్రభావం కనిపిస్తున్నది.

**వెల్లువలా మద్దతు**

బీఆర్ఎస్ పార్టీ చేస్తున్న అభివృద్ధి, సంక్షేమానికి ప్రజలు జై కొడుతున్నారు. ఇప్పటికే పలు గ్రామాలు, తండాలు స్వచ్ఛందంగా గులాబీ పార్టీకి మద్దతు తెలిపారు. త్వరలో జరగబోయే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్‌కే మా ఓటు అంటూ ప్రకటిస్తున్నాయి. ప్రధానంగా తండాలు ఎక్కువగా మొగ్గు చూపుతూ ఏకగ్రీవ తీర్మానాలు ప్రకటిస్తున్నాయి. కాగా గతంలోనూ బీఆర్ఎస్ గూటికి వలసల పర్వం కొనసాగుతూనే వస్తున్నది.

**స్వచ్ఛందంగా తరలివస్తూ..**

గతంలో రాజకీయ పార్టీలోకి నాయకులు ఎత్తుగడలు వేసి తీసుకొస్తే తప్పా కార్యకర్తలు, యువకులు వచ్చే వారు కాదు. కానీ ఇప్పుడా ఆ పరిస్థితి లేదు. బీఆర్ఎస్ చేస్తున్న మంచి పనులు చూసి ప్రజలు, యువకుల తీరు కొత్త ఆలోచనలకు తెర లేపుతున్నది. ఎలాంటి డిమాండ్లు లేకుండానే పార్టీలోకి స్వచ్ఛందంగా చేరుతున్నారు. దీంతో పార్టీ శ్రేణుల్లో నూతన జోష్ నింపుతున్నది. విద్యార్థి సంఘాలు సైతం మొగ్గు చూపుతుండడంతో గులాబీ జెండాను మెడలో వేసుకుంటున్నది. గతంలో యువత విద్యార్థి సంఘాల బాటలోనే నడిచేవి. కానీ నేడు కొత్త ఆలోచనలు మొదలైనట్లు కనిపిస్తున్నది. ఇందుకు కారణం సీఎం కేసీఆర్, వనపర్తిలో మంత్రి నిరంజన్‌రెడ్డి అని చెప్పొచ్చు.